క్లుప్తంగా

జగన్‌ను కలిసిన రెడ్‌క్రాస్ అధ్యక్షుడు



వైఎస్ జగన్‌కు అంబేడ్కర్ చిత్రపటం అందిస్తున్న ఢిల్లీ నారాయణ, వెంకటపతిరాజు

ఐ.పోలవరం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ ఢిల్లీ నారాయణ శుక్రవారం మర్యాదపూర్వకంగా తాడేపల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. గత నెల 24న ఢిల్లీ నారాయణ కుమారుడి వివాహమైంది. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్‌ను నూతన దంపతులు కలిశారు. వారితో పాటు పార్టీ మండల అధ్యక్షుడు పిన్నమరాజు వెంకటపతిరాజు(శ్రీను) ఉన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా వైఎస్ జగన్‌కు అంబేడ్కర్ చిత్రపటాన్ని అందించారు.

నేడు పత్తిగొందిలో నృత్య కళారూపకం

తాళ్లరేవు: హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారితో శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రపై సంఘం శరణం గచ్చామి నృత్య కళారూప నాటకం ప్రదర్శించనున్నట్లు ముమ్మిడివరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన పత్తిగొందిలో విలేకర్లతో మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ ఈ దేశానికి, సమాజానికి ఆయన రాజ్యాంగాన్ని అందించి ప్రజలకు చేసిన సేవలను వివరిస్తూ, ఆయన జీవిత విశేషాలతో కూడిన నాటకాన్ని ప్రదర్శిస్తారని చెప్పారు. పి.మల్లవరం పంచాయతీ శివారు పత్తిగొందిలోని కేవీఎస్ కన్వెన్షన్ కల్యాణ మంటపంలో సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించే ఈ నాటకానికి పార్టీలకతీతంగా, కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.

ల్యాప్‌టాప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

యానాం: విద్యా శాఖ ద్వారా అందిస్తున్న ల్యాప్‌టాప్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అన్నారు. శుక్రవారం స్థానిక టంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆయన ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ జి.రత్నప్రభ అధ్యక్షత వహించారు. విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ఇన్‌చార్జి ఆర్‌పీఓ చంద్రశేఖర్, పీడీ పీవీఎస్ ప్రకాష్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తాళ్లరేవు: సుంకరపాలెం బైపాస్ జంక్షన్ లక్ష్మీగణపతి వరసిద్ధి వినాయక వర్తక సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. సంఘ నూతన అధ్యక్షునిగా పుగాకు శ్రీనివాసు, ఉపాధ్యక్షునిగా వనచర్ల రామకృష్ణ, కార్యదర్శిగా అడబాల సాంబశివరావు(శివ), సంయుక్త కార్యదర్శిగా కాంద్రేగుల సతీష్, కోశాధికారిగా ఉండి మాణిక్యాలరావు సంయుక్త కోశాధికారిగా ఖండవిల్లి నారాయణరావు(నాని), మరో 12 మంది సభ్యులు ఎన్నికయ్యారు.

కాంప్లెక్స్ సీజ్‌ను అడ్డుకున్న మల్లాడి

యానాం: యానాం బైపాస్ రహదారిలో వ్యాపార సముదాయాన్ని సీజ్ చేయాలన్న నోటీసులతో వచ్చిన మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ప్రశ్నించారు. శుక్రవారం వేగేశ్నభాస్కరరాజు కాంప్లెక్స్‌ను సీజ్ చేయడానికి వచ్చిన అధికారులతో మాట్లాడుతూ, గడువు ఉండగా కాంప్లెక్స్‌ను సీజ్ చేయాలని ఎలా ఆదేశాలు ఇచ్చారని ప్రశ్నించారు. టౌన్ ప్లానింగ్ అధికారితో మాట్లాడి సీజ్‌ను నిలుపుదల చేయించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ముమ్మిడివరం: స్థానిక నగర పంచాయతీ పరిధి మహిపాల చెరువు వద్ద ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని శుక్రవారం ముమ్మిడివరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాళ్లకూరి రాంబాబు ఇంట్లో పది బస్తాల రేషన్ బియ్యం నిల్వ చేయగా, స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశామని ఎస్సై డి.జ్వాలా సాగర్ తెలిపారు.

30 వేల మొక్కలు సిద్ధం

యానాం: జనవరిలో జరిగే యానాం ప్రజా ఉత్సవాల్లో నిర్వహించే ఫల, పుష్ప ప్రదర్శనకు 30 వేల మొక్కలను సిద్ధం చేసినట్లు అధికారులు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావుకు తెలిపారు. శుక్రవారం స్థానిక బొటానికల్ గార్డెన్‌లో పెంచుతున్న మొక్కలను మల్లాడి పరిశీలించారు.

సచివాలయ ఉద్యోగులపై నోడల్ అధికారి ఆగ్రహం

ఉప్పలగుప్తం: ప్రస్తుతం జరుగుతున్న సర్వేలలో జిల్లా వ్యాప్తంగా ఉప్పలగుప్తం మండలం వెనుకబడి ఉండటానికి కారణం ఏమిటని జీఎస్‌డబ్ల్యూ నోడల్ అధికారి ఎస్.త్రినాథ్‌నాయుడు సచివాలయ ఉద్యోగులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. మండలంలో ఆయా గ్రామాల్లో హౌస్ హోల్డ్ సర్వే, ఎన్‌పీసీఎల్ సర్వేల్లో వెనుకబడి ఉండటానికి కారణమేంటని ప్రశ్నించారు. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న టాయిలెట్లను పరిశీలించి, యాప్‌లో అప్లోడ్ చేయాల్సి ఉన్నా.. దానిపై నిర్లక్ష్యం వహిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీవో సీఎస్ రాజ్‌కుమార్, ఏవో కె.మూర్తి పాల్గొన్నారు.

విభిన్న వెలుగులు

- దివ్యాంగుల సేవలో భవిత కేంద్రాలు
- ట్యాబ్‌లు, 18 యాప్‌ల ద్వారా శిక్షణ
- ఈ నెల 9 వరకు దివ్యాంగుల వారోత్సవాలు

అమలాపురం రూరల్ : శారీరక వైకల్యంతో బాధపడుతున్న చిన్నారుల బంగారు భవిష్యత్తు కోసం భవిత కేంద్రాలు చేయూత అందిస్తున్నాయి. విభిన్న ప్రతిభావంతుల చిన్నారుల జీవితాలపై ఈ కేంద్రాలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. వెలుగులు నింపి వారి కలలను సాకారం చేసేందుకు భవిత కేంద్రాలు దోహదం చేస్తున్నాయి. సమగ్ర శిక్షాలోని సహిత విద్య విభాగం ద్వారా వారికి అవసరమైన ఉపకరణాలను సమకూర్చి ఆదరిస్తోంది. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 9వ తేదీ వరకు దివ్యాంగుల వారోత్సవాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలో భవిత కేంద్రాల ద్వారా విభిన్న ప్రతిభావంతులకు అందుతున్న సౌకర్యాలపై ప్రత్యేక కథనం.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో..

భవిత కేంద్రాల నిర్వహణ గతంలో చాలా అధ్వానంగా ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇవి దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపాయని చెప్పొచ్చు. గత ప్రభుత్వ హయాంలో అన్ని రకాల వసతులతో భవిత కేంద్రాలు వృద్ధి చెందాయి. అమలాపురం నియోజవర్గ పరిధిలో అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలో ముమ్మిడివరం, కాట్రేనికోన. ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల్లో భవిత కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల్లో 170 మంది ప్రత్యేక అవసరాల చిన్నారులు సేవలు పొందుతున్నారు. భవిత కేంద్రాలకు కాకుండా, వివిధ పాఠశాలలకు వెళ్లే చిన్నారులు 700 మంది ఉన్నారు. వీరికి మానసికంగా, శారీరకంగా ఎదుగుదల తీసుకురావాలనే సంకల్పంతో పలు రకాల పథకాలు అమలు చేస్తున్నారు. ఎంఆర్ కిట్లు, అత్యాధునిక హియరింగ్ మెషీన్లు, ట్రై సైకిళ్లు, మధ్యాహ్న భోజనంతో పాటు, బస్‌పాస్‌లు, వారానికి ఒక రోజు ఫిజియోథెరపీ, నడవలేని స్థితిలో ఉన్న వారికి ఇంటి దగ్గరే విద్య, వైద్య సేవలు, ప్రతి నెలా స్టైఫండ్, హెచ్‌బీసీ, ట్రాన్స్‌పోర్టు, ఎస్కార్ట్ అలవెన్సులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోంది.

ప్లేస్కూల్ తరహాలో..

చదువుతో పాటు ఆటలు, పాటల్లో ప్లే స్కూల్ తరహాలో.అన్ని రకాలుగా అభివృద్ధి చెందేలా శిక్షణ ఇస్తున్నారు. స్పెషల్ బీఈడీ చేసిన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఈ చిన్నారులు ఆటపాటలతో కూడిన విద్యను అభ్యసిస్తున్నారు. వినికిడి లోపం ఉన్న వాళ్లకు వీడి యో చూపించి అందుకు అనుగుణంగా సిద్ధం చేస్తారు. ఇలా ప్రతి అంశంలోనూ ఉపాధ్యాయులు చక్కటి శిక్షణ ఇచ్చి, లోపాలు

రెండు నియోజకవర్గాల పరిధిలో..	
భవిత కేంద్రాలు	7
కేంద్రాల్లో విద్యార్థులు	172
ఐఈఆర్‌పీలు	7
ఐఈడీఎస్‌ఎస్‌లు	9
ఫిజియోథెరపిస్టులు	2
ఆయాలు	7
అలవెన్సు పొందేవారు	859
ఎస్కార్ట్	221
రవాణా	191
స్టైఫండ్	276
హెచ్‌బీఏ	55

మర్చిపోయేలా చేస్తున్నారు.

ఫిజియోథెరపీ

ప్రతి వారం ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నారు. శారీరక వైకల్యం, పక్షవాతం, గ్రహణమొర్రి, గ్రహణశూల వంటి వాటితో బాధపడుతున్న వారికి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, శస్త్ర చికిత్సలు చేస్తున్నారు.



అమలాపురం బండారులంక భవిత కేంద్రంలో చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పుతున్న ఐఈఆర్పీ

ట్యాబ్‌ల అందజేత

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో దృష్టి, వినికిడి లోపం ఉన్న వారు సైతం సాధారణ విద్యార్థుల్లా ఉన్నత విద్యను చదవాలనే ఉద్దేశంతో వారికి ఆధునిక సాంకేతికతతో కూడిన ట్యాబ్‌లను పంపిణీ చేసింది. ఇందులో ఐఈఆర్‌పీలకు, ఐఈడీఎస్‌ఎస్‌లకు దృష్టిలోపం ఉన్న వారికి, వినికిడి లోపం ఉన్న వారికి ఇలా మొత్త 76 ట్యాబ్‌లను అందజేసింది. ట్యాబ్‌లను ఎలా వినియోగించాలన్న అంశంపై ఉపాధ్యాయులు, చిన్నారులకు శిక్షణ ఇచ్చారు.

అధునాతన సమాచారం

గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ట్యాబ్‌ల్లో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న దృష్టి, వినికిడి లోపం కలిగిన విద్యార్థులకు అనుగుణంగా ట్యాబ్‌ల్లో అత్యంత అధునాతన సమాచారాన్ని నిక్షిప్తం చేశారు. వీటిలో గూగుల్ ట్రాన్స్‌క్రైబ్, గూగుల్ లుక్ అవుట్, డాక్స్, బీ మై ఐ, ఎశిజిన్‌ఆల్, నీట్, జీ బోర్డు, నోట్ ప్యాడ్, గూగుల్ కీ తదితర ప్రత్యేకతలు పొందుపర్చారు. అంధులు, బధిరులకు వీలుగా ట్యాబ్‌ను ఏ వైపు ఉపయోగించినా స్పందించేలా, శబ్ద సాంకేతికతల ద్వారా వినియోగించేలా, దృష్టి లోపం ఉన్న వారికి చిన్న విషయాలనూ స్పష్టంగా చూపడానికి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితరాలతో ప్రత్యేకంగా రూపొందించిన 18 యాప్‌లను ట్యాబ్‌ల్లో పొందుపర్చారు.



బండారులంకలో శారీరక వైకల్యం ఉన్నవారికి అందిస్తున్న ఫిజియోథెరపీ

ఆరోగ్యంలో మార్పు వచ్చింది



తన పనులు తాను చేసుకోగలుగుతుంది. మా పాప హసీని కొన్నేళ్లుగా శారీరక వైకల్యంతో బాధపడేది అమలాపురంలో బండారులంక భవిత కేంద్రంలో చేర్పించిన తర్వాత ఫిజియోథెరపీ సేవలు అందించారు. దీనివల్ల ఆరోగ్యంలో మార్పు వచ్చింది. ప్రస్తుతం తన పనులను చేసుకోగలుగుతంది. ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి, అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఇంటర్ చదువుతుంది.

– కె.రామలక్ష్మి, తల్లి, అమలాపురం

డిజిటల్ విద్యకు ప్రాధాన్యం



భవిత కేంద్రాల్లో చదువుతో పాటు, ఆటపాటల్లో ప్లే స్కూల్ తరహాలో శిక్షణ అందిస్తున్నాం. ప్రత్యేక అవసరాలున్న చిన్నారులకు డిజిటల్ విద్య అందుబాటులోకి వచ్చింది. ఇందులో భాగంగానే గత విద్యా సంవత్సరంలో ఐఈఆర్‌పీలతో పాటు, చిన్నారులకు ట్యాబ్‌లను అందజేశారు. ట్యాబ్‌ల నిర్వహణపై శిక్షణ కూడా ఇచ్చారు.

– ఎం.శ్రీనివాస్, ఐఈఆర్‌పీ, బండారులంక, అమలాపురం

అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ మహేష్ కుమార్ హెచ్చరిక

అమలాపురం రూరల్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్ గోదావరి భవన్‌లో జిల్లా స్థాయి, పీజీఆర్‌ఎస్ నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అర్జీలపై ముందుగా అర్జీదారునికి ఫోన్ చేసి, క్షేత్రస్థాయిలో విచారణకు వెళ్లాలని ఆదేశించారు. సమస్యకు నాణ్యతతో పరిష్కార మార్గం చూపాలన్నారు. ఇకపై అర్జీల విచారణ, పరిష్కారం, అప్లోడింగ్ ప్రక్రియల్లో జాప్యం జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. మెమోలిచ్చి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విజయవంతం చేయాలి

యువత జిల్లా యువ ఉత్సవ్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సూచించారు ఉత్సవ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. యువత ఇందులో తమ ప్రతిభను నిరూపించుకోవాలని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి దూలం కిషోర్ కోరారు. బీవీసీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో ఈ నెల 12న జరుగుతుందని తెలిపారు. పేర్ల నమోదుకు 94941 31671 నంబర్‌లో సంప్రదించాలన్నారు.



యువ ఉత్సవ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రకృతి విపత్తు రీజియన్‌గా ప్రకటన

యానాం: ఫెంగల్ తుపానుతో తీవ్ర ఆస్తి, ప్రాణ నష్టం జరిగిన పుదుచ్చేరి, మాహే, కారైకల్ ప్రాంతాలతో పాటు, యానాంను సైతం శుక్రవారం పుదుచ్చేరి రెవెన్యూ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖ ప్రకృతి విపత్తు రీజియన్‌గా ప్రకటించింది. ఈ మేరకు పుదుచ్చేరి కలెక్టర్ ఎ.కులుంగొత్తన్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ ఏడాది జూలై 30 నుంచి వచ్చే ఏడాది జూన్ 30తో ముగిసే పంట కాలానికి ప్రకృతి విపత్తుల ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించినట్లు తెలిపారు.

కేఆర్‌ఎస్‌ఎస్ సభ్యుడు సత్యనారాయణమూర్తి మృతి

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన కోనసీమ రైల్వేసాధన సమితి(కేఆర్‌ఎస్‌ఎస్) స్టీరింగ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధి దొమ్మేటి సత్యనారాయణమూర్తి(58) గురువారం రాత్రి అనారోగ్యంతో మరణించారు. ఆయన మృతికి కేఆర్‌ఎస్‌ఎస్ స్టీరింగ్ కమిటీ ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ, కేఆర్‌ఎస్‌ఎస్ స్టీరింగ్ కమిటీ ప్రతినిధి కుడుపూడి సూర్యనారాయణరావు శుక్రవారం దివంగత సత్యనారాయణమూర్తి ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. రెండు దశాబ్దాలుగా కోనసీమలో రైలు కూత వినిపించాలన్న డిమాండ్‌తో కేఆర్‌ఎస్‌ఎస్ చేసిన పలు ఉద్యమాలు, పోరాటాలు, సమావేశాల్లో సత్యనారాయణమూర్తి కీలక పాత్ర పోషించారని ఎమ్మెల్సీ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కోనసీమలో మూడు నదులపై నిర్మితమవుతున్న రైల్వే వంతెనల వద్దకు కేఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధుల బృందం ఎప్పుడు సందర్శించినా, తన విధులను కచ్చితంగా నిర్వహించేవారని కేఆర్‌ఎస్‌ఎస్ స్టీరింగ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం గుర్తు చేశారు. కేఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు కల్వకొలను తాతాజీ, సప్పా నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మట్టపర్తి నాగేంద్ర, కుడుపూడి త్రినాథ్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

వ్యక్తిత్వ వికాసానికి క్విజ్ పోటీలు దోహదం

జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: విద్యార్థుల్లో సృజనాత్మకతను, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేందుకు క్విజ్ పోటీలు దోహదం చేస్తాయని జేసీ టి.నిషాంతి అన్నారు రిలయన్స్ ధీరూభాయి అంబానీ క్విజ్ పోటీలను శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆమె ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇవి ఉపకరిస్తాయన్నారు. భవిష్యత్తులో పోటీ పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొంటారని చెప్పారు. జిల్లాలోని 120 హైస్కూళ్ల నుంచి 480 మంది పోటీల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో విజేతలైన పి.గన్నవరం జెడ్పీ స్కూల్ విద్యార్థులు జి.గురురామచరణ్, ఎల్.అజేయుడు ల్యాప్‌టాప్‌లను గెలుచుకున్నారు. రన్నర్స్‌గా వీరవెల్లిపాలెం జెడ్పీ స్కూల్ విద్యార్థులు కె.మౌనిక ఎస్‌ఎస్‌ఎల్ పద్మజకు టాబ్‌లు బహూకరించారు. ప్రైవేటు విభాగంలో విన్నర్స్‌గా గొల్లగూడెం ఆదిత్య టాలెంట్ స్కూల్ విద్యార్థులు అక్బరు, రోహిత్ ల్యాప్‌టాప్‌లను గెలుచుకున్నారు రన్నర్స్‌గా మెర్లపాలెం నక్షత్ర స్కూల్ విద్యార్థులు పూజశ్రీ, రామకృష్ణారెడ్డి టాబ్‌లు అందుకున్నారు. ప్రోత్సాహక బహుమతులుగా సైకిళ్లను డీఈఓ షేక్ సలీం బాష అందజేశారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న డీఈఓ సలీంబాష

ప్రణాళికాబద్ధంగా యానాం అభివృద్ధి

యానాం: తగినన్ని మౌలిక సదుపాయాలతో యానాం నియోజకవర్గాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేశానని, తనపై విమర్శలు చేయడం తగదని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కోట్లాది రూపాయలతో వెనుకబడిన యానాంకు ఓ రూపాన్ని తీసుకువచ్చానన్నారు. ఎమ్మెల్యే అశోక్ మాటలు మినహా చేతల్లో ఏమీ చేయడం లేదని విమర్శించారు. యానాంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్‌పై ఎల్జీకి ఫ/ర్యాదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. దొమ్మేటి పేట ఇండస్ట్రియల్ ఎస్టేట్, పరిసరాల్లో ఉన్న రీజెన్సీ భూమిలో దశల వారీగా ఫ్యాక్టరీని తరలించాలని ప్రభుత్వానికి పిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

బడుగు, బలహీన వర్గాల పెన్నిధి అంబేడ్కర్



అమలాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణి, వైఎస్సార్ సీపీ నాయకులు



ముమ్మిడివరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘ నాయకులు

మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణి

అమలాపురం టౌన్: సమాజంలో బడుగు, బలహీన వర్గాల పెన్నిధిగా ఎన్నో హక్కులు కల్పించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో అందరూ పయనించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక మద్దాలవారిపేటలోని అంబేడ్కర్ విగ్రహానికి చైర్‌పర్సన్ నాగేంద్రమణి శుక్రవారం ఉదయం నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మున్సిపల్ కౌన్సిలర్లు నాగారపు వెంకటేశ్వరరావు, చిట్టూరి పెదబాబు, చిత్రపు రామకృష్ణ, కట్టోజు సన్యాసిదాసు, మున్సిపల్ కౌన్సిల్ విప్ బండారు సత్యనారాయణ తదితరులు పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులోని అంబేడ్కర్ విగ్రహానికి దళిత ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ జంగా బాబూరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే నియోజకవర్గ కాంగ్రెస్ కో–ఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో గడియారం స్తంభం సెంటరులో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఎండీ షకీలా తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

అభ్యుదయ ప్రదాత అంబేడ్కర్

ముమ్మిడివరం: రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు అంబేడ్కర్ విగ్రహాలకు ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి కమిషనర్ పి.రవివర్మతో పాటు, పలువురు నాయకులు నివాళులర్పించారు. అలాగే పోలమ్మ చెరువు వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి పలువురు నాయకులు నివాళులర్పించి, అంబేడ్కర్ సేవలను కొనియాడారు. సమ సమాజ స్థాపనకు అభ్యుదయ బావాలను సమాజానికి అందించిన మహోన్నత వ్యక్తి అని శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం, ఆధ్వర్యంలో అయినాపురం, అనాతవరం, బొండాయికోడు, పల్లిపాలెం సెంటర్, తానేల్లంక, కొత్తలంక, గాడిలంక, కర్రివానిరేవు అన్నంపల్లి, కొమానపల్లితో పాటు, పలు గ్రామాల్లో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ మేధావి అంబేడ్కర్‌కు నివాళులు

అల్లవరం: రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలు వాడవాడలా జరిగాయి. అల్లవరం, మొగళ్లమూరు గ్రామాల్లో మాజీ ఎంపీ చింతా అనురాధ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. సర్పంచ్ రాయుడు విష్ణు, చిట్టిబాబు, చిరంజీవి రమణ తదితరులు పాల్గొన్నారు. గోడిలోని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ఆయన నివాసంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రేవు శ్రీనివాసరావు, ప్రసాద్, కొంబత్తుల రమేష్, పోతుల ధనరాజు తదితరులు పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారి కర్నీడీ మూర్తి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీడీఓ కృష్ణమోహన్, ఏఓ లక్ష్మణరావు, కార్యదర్శులు రాజమోహన్, రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పలుచోట్ల ఆయన విగ్రహాలకు ఘన నివాళులర్పించారు. స్థానిక అంబేడ్కర్ భవన్, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉన్న విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. స్థానిక ప్రజా సంఘాల భవనంలో అంబేడ్కర్ చిత్రపటానికి ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో నాయకులు ఉంగరాల వెంకటేశ్వరరావు, టేకుమూడి లక్ష్మణరావు, దడాల జగదీశ్వరరావు, వడ్డి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



మొగళ్లమూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ అనురాధ



గోడిలో అంబేడ్కర్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

ఎమ్మెల్యే అశోక్ నివాళి

యానాం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం నియోజకవర్గ పరిధిలో నిర్వహించారు. సమాచార శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అదేవిధంగా గోపాల్‌నగర్‌లో అంబేడ్కర్ విజ్ఞాన భవన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. రిటైర్డ్ ఆర్‌ఏఓ గిడ్డి బలరామ్, పీడబ్ల్యూడీ అధికారులు పాల్గొన్నారు. స్థానిక పాత బస్టాండ్‌లో, విజ్ఞాన భవన్‌లో అంబేడ్కర్ విగ్రహాలకు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నివాళులర్పించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ గిడ్ల చంద్రరావు, మాజీ వైస్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్ పాల్గొన్నారు. మెట్టకూరు, అంబేడ్కర్‌నగర్, టాక్సీస్టాండ్, వికాస్‌కాలనీ, పరంపేట, దరియాలతిప్ప, దొమ్మేటి పేట తదితర ప్రాంతాల్లో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి.

ఉప్పలగుప్తం: మునిపల్లి గ్రామంలో సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో దోనిపాటి అశోకచక్రవర్తి , దోనిపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: జీఎంసీ బాలయోగి వారిధి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి దళిత సైన్యం జాతీయ ఉపాధ్యక్షుడు దుక్కిపాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. టి.కొత్తపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ నామాడి దయానా 50 మంది రోగులకు పాలు, రొట్టెలు అందజేశారు.

‘విశ్వకర్మ’శిక్షణ తరగతులు ప్రారంభించాలి

అమలాపురం టౌన్: జిల్లాలో విశ్వ కర్మ యోజన శిక్షణ తరగతులు త్వరితగతిన ప్రారంభించి, లబ్ధిదారులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కార్పెంటర్ చేతివృత్తుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో జిల్లా అధికారి డి.హరీష్ శేషుకు శుక్రవారం ఓ వినతిపత్రం అందించారు. ఈ పథకం కింద 18 రకాల చేతివృత్తిదారులను ఆన్‌లైన్‌లో అధికారికంగా గుర్తించారని వారు గుర్తు చేశారు. ఈ పథకం అమలులోకి వచ్చి ఏడాది దాటుతున్నా, ఇటీవలే లబ్ధిదారులకు పథకంలో రిజిస్ట్రేషన్ పత్రాలు, గుర్తింపు కార్డులు పోస్టల్ ద్వారా అందాయని పేర్కొన్నారు. అయితే ఇప్పటిదాకా శిక్షణ తరగతులు మాత్రం ప్రారంభం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకం ఇంకా పూర్తి స్థాయి అమలుకు నోచుకోక అనేక మంది వృత్తిదారులు ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో వృత్తిదారుల సౌలభ్యం కోసం అమలాపురం, రామచంద్రపురంలను శిక్షణా తరగతులకు కేంద్రాలుగా ఎంపిక చేయాలని కోరారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, సంఘ ప్రతినిధులు కొనుకు వెంకటేశ్వరరావు, పితాని బేబీరావు, కముజు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



హరీష్ శేషుకు వినతిపత్రం ఇస్తున్న సంఘ ప్రతినిధులు